క్లుప్తంగా

కూరగాయల సాగుపై అవగాహన కల్పించాలి

మరికల్: ఉద్యానవన శాఖ అధికారులు కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని రైతు సంఘం నాయకులు హన్మంతు, రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు కూరగాయల సాగుపై అవగాహన లేకపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వాటి ధరలు మండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ పంటలు తప్ప రైతులు ఎవరూ కూరగాయల సాగుపై దృష్టి పెట్టడం లేదని పేర్కొన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో తోటల విస్తీర్ణం పెరిగేలా ఉద్యానవన శాఖ అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వర ఉత్సవాలు

మరికల్: మండల కేంద్రంలోని ఆదిహన్మన్ల ఆలయ ఆవరణలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవాలు సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహాన్ని ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్వామీజీని దర్శించుకున్న మండల భక్తులు



కృష్ణా: నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామి కర్ణాటకలోని చింతనహళ్లిలో గవి సిద్ధేశ్వర ఆలయంలో 18 రోజులుగా మౌన అనుష్టానం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని కున్సీ, చేగుంట, ఐనాపూర్‌కు చెందిన భక్తులు సోమవారం స్వామీజీని దర్శించుకున్నారు. కర్ణాటకలోని యాద్గీర్ జిల్లా, గుర్మిట్‌కల్ నియోజకవర్గంలోని ప్రఖ్యాతిగాంచిన గవి సిద్ధేశ్వర ఆలయంలో చేస్తున్న ఈ అనుష్టానం 15న ముగుస్తుందని తెలిపారు.

ఔదుంబార్‌లో వెలసిన శివలింగానికి అభిషేకం

నారాయణపుట టౌన్: జిల్లా కేంద్రంలోని పురాతన బారం బావి నీటితో 16 వార్డుకు చెందిన శివ భక్తులు ఎక్లాస్‌పూర్ సమీపంలో వెలసిన అతి పురాతన ఔదుంబార్ దేవాలయంలోని శివలింగానికి అభిషేకం చేశారు. మేళా ధ్వనులతో పాదయాత్రగా బయలుదేరి శివలింగానికి జలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాధవ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగరాజు, శివ భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎర్ర సత్యం వర్ధంతి

నారాయణపేట టౌన్: మాజీ ఎమ్మెల్యే ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని చౌక్‌బజార్, సత్యనారాయణ చౌరస్తా దగ్గర ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఆయన అభిమానులు, జిల్లా వ్యాప్తంగా ముదిరాజ్ నాయకులు హాజరుకావాలని కోరారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం

నర్వ: ప్రభుత్వ బడుల్లో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. సోమవారం ఉందేకోడ్ జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో జి.వెంకటయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు భార్గవి శ్రీనువాసులు, జ్యోతిరాములు వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్‌ఎస్‌లో 150 మంది, ఎంపీపీఎస్‌లో 160 మంది విద్యార్థులకు టై, బెల్టుల వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దాతలను శాలువాలతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మలత, మాజీ సర్పంచులు జగన్నాథం, బాల్‌దాస్, గ్రామ పెద్దలు కొండప్ప, ఉమాపతి, అశోక్‌గౌడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీలో వ్యవసాయ పరికరాలు

నర్వ: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు సబ్సిడీపై పరికరాలు సరఫరా చేయనున్నట్లు ఏఓ అఖిలారెడ్డి తెలిపారు. ఇందు కోసం ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. పెద్దకారు రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ముందస్తుగా ఇప్పటి వరకు యాంత్రీకరణలో లబ్ధిపొందని రైతులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. మండలంలో బ్యాటరీ చేతి పంపులు, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్, రోటవేటర్స్, బ్రష్‌కటర్స్, కల్టివేటర్ పరికరాలు ఉన్నాయన్నారు. కేజీవీల్స్, కల్టివేటర్స్, రోటవేటర్స్ కావల్సిన రైతులు ట్రాక్టర్ ఆర్సీ రైతు పేరున తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మురుగు.. పరుగు



ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన ముళ్లపొదలతో నిండిన మురుగు గుంత ఇలా

- గ్రామ నడిమధ్యలో మురుగు గుంతలు
- సీసీ రోడ్లు, డ్రెయినేజీ లేక ఇక్కట్లు
- రాత్రి వేళలో దోమల బెడద
- పట్టించుకోని అధికారులు

ఊట్కూర్: ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పేరుతో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. అయినా గ్రామం నడిబొడ్డున, ప్రభుత్వ కార్యాలయాల పక్కన ముళ్లపొదలు, మురుగు గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సకాలంలో పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్కడ పడిన గొంగడి అక్కడే అన్నట్టుగా మురుగు రోడ్లపై పరుగులు తీస్తోంది. వర్షాకాలంలో మురుగు, దోమల బెడదతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశముందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. శివాజీనగర్‌లో మురుగు కాల్వలు లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. శివాజీ నగర్‌లోని హనుమాన్ మందిర్ సీసీ రోడ్డుపై పక్కన పెద్ద మురుగు గుంత ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సీసీ రోడ్డుపై యథేచ్ఛగా గేదెలను కట్టివేస్తున్నాడు. తహసీల్దార్ కార్యాలయం పక్కన సుమారు ఎకర స్థలంలో మురుగు గుంత ఉంది. మురుగుతో పాటు ముళ్లపొదలు పెరిగాయి. వేంకటేశ్వరనగర్‌లో మురుగు కాల్వలు లేక పోవడంతో కందకం నుంచి మురుగు రోడ్డుపై పారుతోంది. దీంతో రాత్రి వేళలలో దోమల బెడద, దుర్వాసన వెదజల్లుతున్నాయి. పాతపేట వీధిలో మురుగు కాల్వలు లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధి కారులు స్పందించి మురుగు కాల్వలను, సీసీ రోడ్డుల ఏర్పాటుతో పాటు మురుగునీటి గుంతలను పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శివాజీనగర్‌లో ఇళ్ల మధ్యలో మురుగు గుంత



వేంకటేశ్వరనగర్‌లో కందకం గుంతలో నుంచి వస్తున్న మురుగు



ఊట్కూర్‌లో కాల్వలు లేక సీసీ రోడ్డుపై పారుతున్న మురుగు

దోమల బెడద అధికంగా ఉంది..



గ్రామంలోని నడిబొడ్డున గుంతల్లో ముళ్లపొదలు పెరగడంతో పాటు మురుగు చేరి దుర్వాసన వస్తోంది. రాత్రి వేళల్లో దోమల బెడద అధికంగా ఉంది. వర్షాకాలం కావడంతో విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ముళ్ల పొదలు తొలగించి, గుంతలు పూడ్చాలి.

– ఎం.రమేశ్ బాబు, రిటైర్డ్ పీఈటీ, ఊట్కూర్

మురుగు కాల్వలు నిర్మించాలి..



గ్రామంలో మురుగు కాల్వలు లేక పోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. వేంకటేశ్వర నగర్‌లో కందకం నుంచి మురుగు రోడ్డుపై వస్తుండడంతో దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. అధికారులకు, నాయకులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదు. వెంటనే మురుగు కాల్వలు నిర్మించాలి.

– కుర్వ పద్మ, ఊట్కూర్

యజమానులకు నోటీసులు ఇచ్చాం..



తహసీల్దార్ కార్యాలయం పక్కన ఎకర స్థలంలో మురుగు చేరడంతో పాటు ముళ్లపొదలు పెరిగిన మాట వాస్తవం. ఈ విషయమై స్థలం యజమానులు 11 మందికి రెండు సార్లు నోటీసులు ఇచ్చాం. వారు స్పందించడం లేదు. గ్రామంలో ఉన్న మురుగు నీటి గుంతలు పూడ్చివేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

– శ్రీనివాస్‌రావు, కార్యదర్శి, ఊట్కూర్

భక్తిశ్రద్ధలతో మధ్యారాధనోత్సవాలు



గోపాలం సేవ నిర్వహిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి మధ్యారాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతం, నిర్మాల్యం, విశేష పంచామృత అభిషేకం, అలంకరణ, అలంకార పంక్తి, మహానైవేద్యం, భజన, పల్లకీ సేవా తదితర ప్రత్యేక పూజలు చేశారు. హరిదాసుల సంకీర్తనలతో పల్లా పురవీధుల గుండా గోపాలం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు గణపతి, అనంతశయన స్వామి, అంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి విద్వాన్ అనిల్దేశాయి ఆధ్యాత్మిక ప్రవచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నర్సింహాచారి, సేవా సమితి సభ్యులు రఘుప్రేమ్, భీంసేన్ రావు, శ్రీధర్‌రావు, శ్రీపాద్, శేషు, శ్రీనివాస, నర్సింహ, నారాయణరావు, అనంతరావు, సీతారామరావు, మంజునాథ్ జోషి, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెన నిర్మాణం పరిశీలన



తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ రాములు

కొత్తపల్లి: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులో వరద నీరు రావడంతో కొత్తపల్లి–భూనీడు గ్రామాల మధ్య వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బ్రిడ్జి సమీపంలో తాత్కాలిక వంతెన భారీ వర్షాలకు కూలిపోయింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సంబంధిత అధికారులకు సమాచారం అందించగా, కాంట్రాక్టర్‌తో మాట్లాడి రాకపోకలకు అంతరాయం కలగకుండా వంతెన నిర్మాణం చేయాలని ఆదేశించారు. సోమవారం ఉదయం తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను ఆర్ అండ్‌బీ డీఈ రాములు పరిశీలించారు. కొత్తపల్లి ఊర చెరువు దగ్గర బాక్స్ కల్వర్టు నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పైనున్న చెరువు నుంచి వచ్చే వరద నేరుగా ఊర చెరువులోకి వెళ్లేలా కల్వర్టు నిర్మాణం వేగవంతం చేయాలని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతగా నిర్మించాలని సూచించారు.

టీఎల్‌ఎం మేళా సన్నాహక సమావేశం



టీఎల్‌ఎం మేళా సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ అంజనేయులు

కొత్తపల్లి: మండల స్థాయిలో నిర్వహించే టీఎల్‌ఎం మేళా విజయవంతం చేయాలని మండల విద్యాధికారి కోరారు. సోమవారం కొత్తపల్లి మండల కేంద్రంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 18న కొత్తపల్లి మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే టీఎల్‌ఎం మేళాను విజయవంతం చేయాలని సూచించారు. ఈ మేళాకు మండలంలోని ప్రతి పాఠశాల నుంచి విధిగా అంశాల వారీగా మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. మేళాకు తీసుకొస్తున్న మెటీరియల్ విద్యార్థులకు అవగాహన కలిగేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



ఇసుకబావి స్థలాన్ని పరిశీలిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కోస్గిరూరల్: వెనకబడిన కొడంగల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంతో పాటు కోస్గి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. రెవెన్యూశాఖ ఆధీనంలో ఉన్న మహబూబ్‌నగర్–తాండూర్ ప్రధాన రహదారికి పక్కన ఉన్న ఇసుక బావి, పట్టణంలోని నాగులబావి, శివాజీ చౌరస్తాలోని పట్టు పరిశ్రమ శాఖకు చెందిన 6 ఎకరాల స్థలాన్ని పలు అభివృద్ధి పనులకు కేటాయించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం శ్రీరామ కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టు, పార్కును పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఆర్ఐ సుభాష్ ఉన్నారు.

వైద్య సదుపాయాలను మెరుగు పర్చుకుందాం

మద్దూరు: మద్దూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలను మరింత మెరుగు పర్చుకుందామని కొడంగల్ ఏరియా అథారటీ అధికారి (కడా) వెంకట్‌రెడ్డి సూచించారు. మద్దూరు పట్టణంలోని సీహెచ్‌సీ ఆస్పత్రిని, ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. ఈ ఆస్పత్రికి రోగుల తాడికి ఎక్కువగా ఉండడంతో 30 పడకలు సరిపో వడం లేదని, సిబ్బందికి కూడా సరిపోవడం లేదని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చాలా మండలాలకు ఈ సీహెచ్‌సీ సెంటర్‌రే దిక్కు అని, 100 పడకల ఆస్పత్రిగా మార్చాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు విధిగా బీమా చేసుకోవాలి



కృష్ణా: మహిళా సంఘాల్లోని మహిళలు విధిగా బీమా చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రధానంగా మహిళలు తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించాలని, పొదుపు పెంచుకోవాలని, జీవనజ్యోతి బీమా పాలసీ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం బస్వరాజ్, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, మహిళా సంఘం సభ్యులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సోమవారం అంబేడ్కర్ చౌరస్తా నుంచి చౌక్ బజారు మీదుగా నర్సిరెడ్డి చౌరస్తా వరకు దాదాపు 80 మందికి పైగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, సిద్ధు మాట్లాడారు. రాష్ట్రంలో ఒకప్పుడు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమై ఉండేవని, నేడు గ్రామాల్లో విద్యార్థులు, యువతకు వాటికి బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు మధు మహేష్, బాలకృష్ణ, శివ, ఎల్లప్ప, గణేష్, రవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, పీవైఎల్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'నులి'పురుగుల నిర్మూలన దినోత్సవం



మాగనూర్‌లో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

మాగనూర్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి తేజశ్విని తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, మూడు ప్రైవేట్ పాఠశాలలో వైద్య సిబ్బంది నులిపురుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మురళీధర్‌రెడ్డి, ఏఎస్ఏ సుధ, ఆశా కార్యకర్తలు సరిత, రేణుక, కృష్ణవేణి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊట్కూరు: నులిపురుగుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ సాయిరాం, డాక్టర్ శివాని ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశా రు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వా డీ కేంద్రాలలో 1 నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సురేష్, గోవిందమ్మ, లక్ష్మి, కవిత, మణిమాల పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో వైద్య సిబ్బంది శృతి ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శేఖర్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉండగలరని డాక్టర్ విరోజ, డాక్టర్ శృతి అన్నారు. మండలంలోని చిన్నజట్రం, జాజాపూర్ ప్రభుత్వ పాఠశాలతో పాటు పట్టణంలోని శ్రీ హంసవాహిని స్కూల్లో నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్నారం లక్ష్మీదేవి కిష్టారెడ్డి, ఆశా కార్యకర్తలు రేణుక, ప్రమీల, అరుణ, జయమ్మ, మంజుల, ప్రిన్సిపాల్లు మహేష్, భారతి, రాజేష్ కుమార్, డీఎస్ఓ భాను ప్రకాష్, ఉపాధ్యాయులు నమ్రత, విజయ, అమల, షమీనా విద్యార్థులు పాల్గొన్నారు.

నర్వ: పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, కడుపునొప్పి వంటి ఆరోగ్య సమస్యలకు కారణమైన నులిపురుగులను నిర్మిలిద్దామని ఏఎన్‌ఎం సుభాషితమ్మ అన్నారు. సోమవారం పెద్దకడ్మూర్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మంజుల, జ్యోతి, పద్మ, ఫాతీమా పాల్గొన్నారు.

దామరగిద్ద: నులిపురుగుల నివారణకు మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపీడీఓ సాయిలక్ష్మి, వైద్యాధికారి శ్రవంతి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నులిపురుగు నివారణకు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

మద్దూరు: ఆల్బెండజోల్ మాత్రలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలత సూచించారు. మద్దూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో, అంగన్‌వాడీ కేంద్రలో ఆరోగ్య సిబ్బంది మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి ఉత్సవాలు

నారాయణపేట టౌన్: నారాయణపేటలోని పళ్ల వీధిలో వెలసిన రాఘవేంద్ర స్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం ఆరాధన ఉత్సవాలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు వేద మంత్రాల మధ్య పంచామృత అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా మంగళహారతులు ఇచ్చి నైవేద్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు.

మొక్కలు నాటిన లయన్స్‌క్లబ్ సభ్యులు



మక్తల్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో మొక్కలు నాటుతున్న లయన్స్ సభ్యులు

మక్తల్: లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ మహేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మక్తల్ పట్టణంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యఆంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకుముందు కేక్‌కట్ చేసి గవర్నర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బ్రెడ్లు, పండ్లు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు కొండయ్య, కోళ్ల వెంకటేష్, సత్యనారాయణ. అంజన్ ప్రసాద్, అంబదాస్‌రావు, అశోక్, పృథ్వీరాజ్, కర్నిస్వామి, అనుగొండ శ్రీనివాసులు, నరేందర్, మణికంఠ గౌడ్, డివి చారి, రవికుమార్, రమేష్, కట్ట సురేష్, పృథ్వీరాజ్, రాజేష్‌గౌడ్, డాక్టర్ వినుత, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే తపస్ లక్ష్యం



నేరడగం పాఠశాలలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో తపస్ నాయకులు

మాగనూర్: నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా తపస్ పనిచేస్తోందని జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి అన్నారు. కృష్ణ, మాగనూర్ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. సభ్యత్వ అభియాన్‌లో భాగంగా మాగనూర్, నేరడగం, వడ్వాట్, వర్కూర్ పాఠశాలలోని ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, సహాయ కారదర్శి భీమ్‌రెడ్డి, నర్సింహులు, బాబురెడ్డి, రామ్మోహన్, నర్మద, రమేష్, మోహన్‌నాయక్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉజ్జెల్లి ముంపు గ్రామానికి నిధులు అందించాలి



నూతన ఎస్‌డీసీ రాజేందర్‌ను సన్మానిస్తున్న ఉజ్జెల్లి గ్రామస్తులు

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి గ్రామానికి మంజూరైన నిధులను త్వరగా లబ్ధిదారుల ఖాతాలో వేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఎస్‌డీసీ రాజేందర్‌ను పిలిపించి ఉజ్జెల్లి ముంపు గ్రామ నిధుల విడుదల పనులను త్వరగా ప్రారంభించి, వారికి నిధులు అందించాలని ఆదేశించారు. ఎస్‌డీసీ అధికారి రాజేందర్ బదిలీపై వెళ్లి మళ్లీ ఇదే జిల్లాకు రావడంతో ఆయనను గ్రామస్తులు సన్మానించి స్వాగతం పలికారు. గ్రామానికి సంబంధించి ఫైల్ ఏ స్టేజ్‌లో ఉందో చూసి వారం రోజులో లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేసే ప్రక్రియను మొదలు పెడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, గ్రామస్తులు సుతారి రవి, నర్సింగప్ప, బస్వారాజ్, మల్లికార్జున, చాకలి రాజు, ఏడేపల్లి అంజి, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



దీక్షలో పాల్గొన్న రైతులకు మద్దతు ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సభాష్, మాజీ సర్పంచ్ బసిరెడ్డి, నర్సిరెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. మండలంలోని కాన్‌కుర్తిలో భూ నిర్వాసిత రైతులు ఐదో రోజు చేపట్టిన దీక్షకు వారు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాన్‌కుర్తి లో చేపట్టనున్న రిజర్వాయర్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు ఎకరాలకు రూ.35 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో పాల్గొన్న రైతులు శీలం నర్సిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నర్సిరెడ్డి, బసిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.